



# కరపత్రం

SINCE 2014


శుక్రవారం డిసెంబర్ 6 2024 | సంపుటి :0 | సంచిక : 58 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# కేసీఆర్.. మీ పెద్దరికం

## ఎందుకు నిలబెట్టుకోవడం లేదు: సీఎం రేవంత్‌రెడ్డి

### ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.



- ఆత్మగౌరవంతో బతకాలనేది పేదల కల అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌ను సీఎం ఆవిష్కరించారు.
- ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
- "రోటీ కపడా ఔర్ మకాన్ అనేది ఇందిరమ్మ నినాదం. ఇల్లు, వ్యవసాయ భూమిని ప్రజలు ఆత్మగౌరవంగా భావిస్తారు.
- అందుకే ఇందిరాగాంధీ దశాబ్దాల క్రితమే ఇళ్లు, భూపంపిణీ పథకాలను ప్రారంభించారు.

హైదరాబాద్: దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చు కానీ.. ఇందిరమ్మ కాలనీ లేని ఊరు లేదు. రూ.10 వేలతో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం నేడు రూ.5 లక్షలకు చేరుకుంది. ఇంటి నిర్మాణానికి ప్రతి పేదవాడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నాం. అర్హులైన వారికే ప్రభుత్వ ఇల్లు చెందాలనేది మా లక్ష్యం. తొలి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**ప్రతిపక్ష నేత సీటు ఖాళీగా ఉండటం రాష్ట్రానికి మంచిది కాదు**

అనంతరం భారాస అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి రేవంత్ పలు వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేత సీటు అసెంబ్లీలో ఖాళీగా ఉండటం రాష్ట్రానికి మంచిది కాదన్నారు. అసెంబ్లీకి కేసీఆర్ వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. రాష్ట్రంలో అధికార, విపక్షాలు అంటే భారత్-పాకిస్థాన్ తరహాలో పరిస్థితిని ఎందుకు మార్చారని ప్రశ్నించారు. "ఎవరినో నిందించుకుంటూ కాలం గడపకుండా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నాం.

2 లో

## భారాస ఆందోళన..

### గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత



హైదరాబాద్: మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావును విడుదల చేయాలంటూ భారాస కార్యకర్తలు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద గురువారం హరీశ్‌రావుతో పాటు కొందరు భారాస నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు గచ్చిబౌలి పీఎస్‌కు తరలించారు. పార్టీ శ్రేణులతో కలిసి గచ్చిబౌలి పీఎస్‌కు వచ్చిన ఎమ్మెల్సీ కవిత.. హరీశ్‌రావును విడుదల చేయాలంటూ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. కార్యకర్తల ఆందోళనతో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది.




## భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్ట్

- భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.
- బుధవారం బంజారాహిల్స్ పీఎస్‌లో విధుకు ఆటంకం కలిగించారంటూ సీఐ రాఘవేంద్ర ఫిర్యాదు చేశారు.
- దీంతో కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు 20 మందిపై కేసు నమోదైంది.
- ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు భారీగా పోలీసులు చేరుకుని అరెస్ట్ చేశారు.
- ఆయన్ను అక్కడి నుంచి బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించారు.

2 లో

## సంధ్య థియేటర్ వద్ద తోపులాట ఘటన..

## బాలుడి పరిస్థితి విషమం

సంధ్య థియేటర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన తోపులాటలో గాయపడిన బాలుడు శ్రీతేజ్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు.

2 లో

### నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన

## పీఎస్ఎల్‌వీ-సీ59

- శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ-సీ59 వాహక నౌక విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది.



2 లో

శ్రీహరికోట: శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ-సీ59 వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. సాంకేతిక లోపం కారణంగా నిన్న చేపట్టాల్సిన ప్రయోగం ఇవాల్టికి వాయిదా పడిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం 4.04 గంటలకు వాహకనౌక నిప్పులు చిమ్ముతూ

## ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై పిటిషన్.. హైకోర్టు కీలక ఆదేశాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది.



2 లో

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం వడ్డించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనల్లో నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి: మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్: భారాస నేతలకు అధికారం పోయిన తర్వాత కార్యకర్తలు గుర్తొచ్చారని మంత్రి కొండా సురేఖ అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ గురించి మాట్లాడే అర్హత వారికి లేదని చెప్పారు. తెలంగాణ కోసం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాజీనామా చేశారన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సురేఖ మాట్లాడారు.

"మంత్రి కోమటిరెడ్డి గురించి గంధపు చెక్కల వ్యాపారి ఒకరు అగౌరవంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారు. అసెంబ్లీకి రాని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతారు?కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి. భారాస అధికారంలో ఉండగా రేవంత్‌రెడ్డిని గతంలో చిన్న డ్రోన్ కేసులో కక్షపూరితంగా అరెస్ట్ చేశారు"అని కొండా సురేఖ అన్నారు.

## బీఆర్ఎస్ నేతల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నా :



హైదరాబాద్ : బీఆర్ఎస్ నేతల అరెస్టులపై ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది ప్రజా పాలన కాదు.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కవిత పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన మా పార్టీ సీనియర్ నేతలను తక్షణమే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీని కవిత డిమాండ్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం డిసెంబర్ 6 2024

# సంపాదకీయం

## రాజ్యాంగ విలువలకు పట్టంగట్టిన తీర్పు!

దేశంలో 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భాన భారత రాజ్యాంగ పీఠికలో సోషలిజం (సామ్యవాదం), సెక్యులరిజం (లౌకికవాదం) అంతర్భాగమని పునరుద్ఘాటిస్తూ సుప్రీంకోర్టు కీలక మైలురాయి లాంటి తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో ఈ సూత్రాలు ఉండటాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ బల్‌రాం సింగ్‌తో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కొట్టివేయడం విశేషం. ఈ పిటిషన్‌దారుల్లో బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యన్‌స్వామి కూడా ఒకరు కావడం గమనార్హం. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు రాజ్యాంగ మౌలిక సూత్రాలు, విలువలను తెలియజేస్తున్నది. అంతేకాదు, భారతదేశపు ప్రజాస్వామ్య, భిన్నత్వంలో ఏకత్వం, సమ్మిళితత్వాన్ని రూపొందించడంలో వాటి ప్రాధాన్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్తున్నది.

42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలను చేర్చారు. ఇది భారత రాజ్యాంగ చరిత్రలో చరిత్రాత్మక ఘటన. మన దేశం రాజకీయ, ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ప్రవేశపెట్టిన ఈ సూత్రాలు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కట్టుబడి ఉన్న ఆదర్శాలకు, నిబద్ధతలకు ప్రతీకలు. ఈ సూత్రాలు రాజ్యాంగ పీఠికలో చేర్పులు మాత్రమే కాదు, భారతీయ నైతిక విలువలు, రాజకీయపరమైన చర్చల్లో లోతుగా పాతుకుపోయిన విలువలకు అధికారిక ఆమోద ముద్ర అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ పీఠికతో సహా రాజ్యాంగాన్ని సవరించే హక్కు నిస్సందేహంగా పార్లమెంట్‌కు ఉన్నదని సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ సందర్భంగా పేర్కొన్నది. అయితే, ఈ సూత్రాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించాయని లేదా అసలు ఉద్దేశాన్ని అవి వక్రీకరించాయనే వాదనను ఉన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. అంతేకాదు, ఆర్టికల్స్ 14, 15, 16, 25-30 సమానత్వం, వివక్ష లేకపోవడాన్ని, మత స్వేచ్ఛను కల్పిస్తున్నట్టే లౌకికవాదం అనేది అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని న్యాయస్థానం నొక్కిచెప్పింది. అలాగే దేశంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల పెట్టుబడులను అనుమతించడం ద్వారా మిశ్రమ ఆర్థిక నమూనాతో సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల దేశం నిబద్ధతను సామ్యవాదం ప్రతిబింబిస్తుంది. ఎమర్జెన్సీ సమయంలో తీసుకొచ్చిన 42వ రాజ్యాంగ సవరణ చట్టబద్ధతపై తలెత్తుతున్న ఆందోళనలను కూడా సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. ఆ తర్వాత 44వ రాజ్యాంగ సవరణ సందర్భంగా పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఈ సూత్రాలను పునరుద్ఘాటించినట్టు న్యాయస్థానం గుర్తుచేసింది. సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలు భారత రాజ్యాంగ నైతిక విలువల్లో లోతుగా పాతుకుపోయాయనీ, అవి భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో అంతర్భాగమని కోర్టు చెప్పింది. 'మనమంతా భారతీయ ప్రజలం' అనే ఆకాంక్షలను ప్రతిబింబించేలా పీఠికను సజీవ సాక్ష్యంగా న్యాయవ్యవస్థ గుర్తించిందని చెప్పడానికి ఈ తీర్పు తార్కాణం.

భారత రాజకీయ, ఆర్థిక, విధానరమైన నిర్ణయాలు, చర్చల్లో సామ్యవాదం కీలకపాత్ర పోషిస్తున్నది. ఈ సూత్రాన్ని మన దేశం అవలంబించిన నాటి నుంచి సమకాలీన సంక్షేమ విధానాల అమలులో సామ్యవాదం మార్గనిర్దేశక శక్తిగా ఉన్నది. ముఖ్యంగా 1980లో బొంబాయి వేదికగా బీజేపీని స్థాపించినప్పుడు ఆ పార్టీ గాంధేయ సోషలిజాన్ని తమ వ్యవస్థాపక సూత్రాల్లో ఒకటిగా స్వీకరించింది. గాంధేయ సోషలిజం బీజేపీ సైద్ధాంతిక మూలస్తంభమని ఆ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అటల్ బిహారీ వాజపేయి విస్పష్టంగా ప్రకటించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై పిటిషన్..

# హైకోర్టు కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి

**తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.**

భోజనం వికటించిన ఘటనల్లో రెండు కమిటీలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున కోర్టుకు ఏఏజీ తెలిపారు. బాధ్యులైన వాళ్లను ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. నాణ్యమైన భోజనం అందించడానికి ఏజెన్సీలకు చెల్లించే డబ్బులను 40 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. మరోవైపు పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. పీఎం పోషణ్ పథకంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలుండాలని చెప్పారు. కమిటీల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. కమిటీలు సరిగా పనిచేసేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. దీనికి బదులిస్తూ.. అన్ని కమిటీలు పని చేస్తున్నాయని ఏఏజీ తెలిపారు. దీంతో ఏఏజీ చెప్పిన వివరాలను హైకోర్టు నమోదు చేసింది.

**పురపాలికల్లో గ్రామ పంచాయతీల విలీనానికి మార్గం సుగమం**

గ్రామ పంచాయతీలను పురపాలికల్లో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం విలీనం జరిగిందని చెప్పింది. పాలనలో భాగంగా చట్టాలను



తీసుకొచ్చే అధికారం అసెంబ్లీకి ఉందని పేర్కొంది.

రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామపంచాయతీలను ఇటీవల పురపాలికల్లో విలీనం చేశారు. పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. దీంతో పురపాలికల్లో గ్రామ పంచాయతీల

# సంధ్య థియేటర్ వద్ద తోపులాట ఘటన..

# బాలుడి పరిస్థితి విషమం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సంధ్య థియేటర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన తోపులాటలో గాయపడిన బాలుడు శ్రీతేజ్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉందని.. మరో 78 గంటలు అయితే గాని బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఏమీ చెప్పలేమని వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం శ్రీతేజ్‌కు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. రాత్రి నుంచి సామాజిక మాధ్యమాలు, పలు యూట్యూబ్ ఛానళ్లలో బాలుడు చనిపోయినట్టు అసత్య ప్రచారం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. దయచేసి అలాంటి వార్తలు ప్రసారం చేయొద్దని వారు వాపోయారు. అందరూ తమకు అండగా నిలవాలని కోరారు. పుష్ప-2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో వచ్చిన చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రేవతి(35) అనే మహిళతోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ(9) కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఆసుపత్రి చికిత్సలో పొందుతూ తల్లి మృతిచెందారు.



కుటుంబ సభ్యులతో రేవతి, శ్రీతేజ

# ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులా..?

# రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్ : ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రశ్నల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లనకు తరలిస్తున్నారు. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డి, జగదీశ్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు.

ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు..! పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు..! చేస్తున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు. పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు.. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు.. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు.. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులు.. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు.. చివరకు ప్రజలపై కూడా కేసులు నమోదు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం హింసిస్తుందని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసులు.. కేసులు.. కేసులు.. ఈ పేర్లతో అటు ప్రజలను, ఇటు



ప్రతిపక్షాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాసులు మీకు %-% కేసులు మాకు.. సూటుకేసులు మీకు.. అరెస్టులు మాకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు మా నాయకులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి గార్లతోపాటు మా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, నాయకుల అరెస్ట్‌లు అప్రజాస్వామికం.. తక్షణం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చివరగా జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ నినదించారు.

# నేనూ రోడ్డు ప్రమాద బాధితుడినే: నితిన్ గడ్కరీ

దిల్లీ: దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఘటనలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నా.. ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తానూ కూడా బాధితుడినేని చెప్పారు. చట్టాలంటే ప్రజలకు భయంభక్తీ లేవన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు నితిన్ గడ్కరీ బదులిచ్చారు. "ఇక్కడ నాలుగు అంశాలు కీలకమైవని. రోడ్డు ఇంజినీరింగ్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, సమర్థంగా చట్టాల అమలు. ప్రజలకు అవగాహన కల్పించడం. ఇక్కడ సమస్య ఏంటంటే.. చట్టాలంటే ప్రజలకు భయం గానీ.. గౌరవంగానీ లేవు. రెడ్ సిగ్నల్ పడితే ఆగరు. హెల్మెట్ పెట్టుకోరు. నిన్నటికి నిన్న నా కళ్లముందే ఓ కారు రెడ్ సిగ్నల్ దాటుకుని వెళ్లిపోయింది. హెల్మెట్ ధరించని కారణంగా ఏటా కనీసం 30వేల మంది ప్రాణాలు కోల్పోతున్నట్టు నివేదికలు చెబుతున్నాయి" అని గడ్కరీ వివరించారు.

గాజా విషయంలో భారత్ వైఖరి అదే: పార్లమెంట్‌లో జైశంకర్ వివరణ

"నేను కూడా రోడ్డు ప్రమాద బాధితుడినే. మహారాష్ట్రలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో నాకు యాక్సిడెంట్ అయి కాలు విరిగింది. అందుకే ఈ అంశం నాకు చాలా సున్నితమైంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఎంత కష్టపడుతున్నా.. ఏటా 1.68లక్షల మంది



ప్రాణాలు కోల్పోతున్నారు. చట్టాల అమలు సరిగ్గా లేకపోవడమే దీనిక్కారణం. ప్రజాప్రతినిధులు, మీడియా, సమాజం నుంచి సహకారం లేకుండా వీటిని తగ్గించడం సాధ్యం కాదు. జరిమానాలు పెంచినా ప్రజలు రూల్స్ పాటించట్లేదు" అని కేంద్రమంత్రి తెలిపారు. దీనిపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ పెట్టాలని ఈ సందర్భంగా గడ్కరీ స్పీకర్‌ను కోరారు.

# కేసీఆర్.. మీ పెద్దరికం

## ఎందుకు నిలబెట్టుకోవడం లేదు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

దీనికి ప్రతిపక్షాలు కొంత సమయం ఇచ్చి సహకరించాలి. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రిప్రజెంటేషన్ ఇచ్చి సమస్యలపై చర్చించేవారు. ఆ తర్వాత వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు కూడా అదే తరహాలో ప్రభుత్వానికి సూచనలు చేసేవారు. లోపాలను సరిదిద్దుకోవాలని చెప్పేవారు.

**ఇప్పటికైనా మీ ఆలోచనా విధానం మారాలి**

ఉమ్మడి రాష్ట్రంలో మంచి సంప్రదాయం ఉండేది. సభలో కొన్ని అంశాలను చర్చించి.. ఆ తర్వాత ప్రజల సమస్యలపై ప్రత్యక్షంగా అప్పటి మంత్రులను కలిసేవాళ్లం.. నిధులు రాబట్టుకునేవాళ్లం. గత పదేళ్లు ఆ అవకాశం కల్పించలేదు.. సచివాలయానికే రాలేదు. పదేళ్లు మీరేం చేశారని మేం అడగటం లేదు. ప్రజలు అన్నీ గమనించే భారాసను అధికారానికి దూరం చేశారు. ఇప్పటికైనా మీ ఆలోచనా విధానంలో మార్పు రావాలి. మీ విధానమేంటి? ఆలోచనేంటి? ఈ ప్రభుత్వమే నడవొద్దా?ప్రజలకు సంక్షేమం చేపట్టొద్దా?రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లాల్సిన అవసరం లేదా? మీరు సభకే రావడం లేదు. దీన్ని రాష్ట్ర ప్రజలు ఏవిధంగా అర్థం చేసుకోవాలి? మీ అనుభవం, చతురతను ఉపయోగించి పాలకపక్షానికి సూచనలు చేయండి. ఏ సూచనా చేయకుండా అడ్డుకుంటామనే విధానంలో ఉండటం తెలంగాణకు మంచిదా? మీ పార్టీ నేతలు తెలియక ఏదైనా అన్నప్పుడు ఇది మంచి పద్ధతి కాదని చెప్పాలి కదా! మీ పిల్లలిద్దరినీ మాపైకి ఉసిగొల్పి ఎందుకిలా చేస్తున్నారు?ఎందుకు పెద్దరికం నిలబెట్టుకోవడం లేదు?" అని కేసీఆర్‌ను ప్రశ్నించారు.

ఈనెల 7, 8, 9 తేదీల్లో ప్రజాపాలన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీఎం తెలిపారు. సచివాలయ ప్రాంగణం, నెక్లెస్‌రోడ్డులో వేడుకలు నిర్వహిస్తామన్నారు. 3 రోజుల పాటు పండగ వాతావరణంలో ఇవి జరుగుతాయని.. ఈ వేడుకలకు విపక్ష నేతలనూ ఆహ్వానిస్తామని చెప్పారు. "కేసీఆర్, బండి సంజయ్‌లకు ఆహ్వానాలు పంపిస్తాం. ప్రజలు, నాయకులు ఈ ఉత్సవాల్లో పాల్గొనాలి. ఈనెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తాం. దీనికి సంబంధించిన సూచనలు ఏమైనా ఉంటే అక్కడ చెప్పాలి"అని రేవంత్ సూచించారు.

# భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్ట్



మొదటిపేజీ తరువాయి

అంతకుముందు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున భారాస కార్యకర్తలు కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన ఇంట్లోకి వెళ్లేందుకు హరీశ్‌రావు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇంటి గేట్లు దూకి వెళ్లేందుకు కార్యకర్తలు యత్నించారు. ఈ క్రమంలో హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. హరీశ్‌ను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు యత్నించారు. ఆ తర్వాత కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకు దిగిన భారాస నేతలను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

కౌశిక్‌రెడ్డిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు..

కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 57, 126(2), 127(2), 132, 224, 333, 451(3), 191(2), %తీ/ష 190, తీ/ష% 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆయన్ను కోర్టుకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు బంజారాహిల్స్ పీఎస్ వద్దకు కౌశిక్‌రెడ్డి తరపు న్యాయవాదులు చేరుకున్నారు. వారిని లోపలికి అనుమతించలేదు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అరెస్ట్ చేశారంటూ పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు.

## నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన

# పీఎస్ఎల్‌వీ-సీ59

మొదటిపేజీ తరువాయి

ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3తో పాటు మరికొన్ని చిన్న ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ-సీ59 రాకెట్ ద్వారా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించింది. ప్రోబా-3లో రెండు ఉపగ్రహాలు ఉంటాయి. వీటి బరువు 550 కిలోలు. సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాపై పరిశోధనలు చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందుకోసం అవి పరస్పరం సమన్వయంతో ఒక క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరిస్తాయి. ఈ తరహా ప్రయోగాన్ని చేపట్టడం ప్రపంచంలోనే ఇది మొదటిసారని ఈఎస్ఏ తెలిపింది.

## ఔటర్‌పై కారు ప్రమాదం.. జబర్దస్త్ రామ్‌ప్రసాద్‌కు స్వల్ప గాయాలు

హైదరాబాద్: జబర్దస్త్ కమెడియన్ రామ్‌ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తుక్కుగూడ వద్ద ఔటర్



రింగ్‌రోడ్డుపై ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. షూటింగ్ స్పాట్‌కి వెళ్తుండగా ఔటర్‌పై కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టింది. దీంతో ముందున్న కారును రామ్‌ప్రసాద్ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతనికి స్వల్ప గాయాలవ్వగా, కారు ధ్వంసమైంది.

# జ్యోతిషం శాస్త్రీయమా? అశాస్త్రీయమా?

## ప్రత్యేక వ్యాసం

డా. నమిలకొండ శ్రీధరాచార్యులు
ఎంఏ జ్యోతిషం

**ఈ మధ్య వార్తాపత్రికలు,టివిలు,సామాజిక మాధ్యమాల్లో జ్యోతిషం పై కొందరు తమ తమ అభిప్రాయాలు వెల్లడించడం చూస్తున్నాము.**

జ్యోతిషం అనేది శాస్త్రం కాదు, అది ఎవరికి ఉపయోగపడదు అంటూ కొందరు వ్యాఖ్యానాలు చెయ్యడం ఒక ఫ్యాషన్ గా మారింది.జ్యోతిష శాస్త్రం పై ఆధిపత్యం సాధించాలనే పట్టుదలతో,శాస్త్రీయ విశ్లేషణలతో పాశ్చాత్యులు మనకంటే ముందున్నారు.

ఇది మన భారతీయులకు బాధాకరమైన సత్యం.మన పురాతన భారతీయ ఆవిష్కరణలు తమవిగా పేటెంట్లు తీసుకోవడం,పరిశోధనా పత్రాలు సమర్పించడం చేసి గొప్ప శాస్త్రజ్ఞులుగా క్రెడిట్ కొట్టేస్తున్నారు. చివరికి మనం రోజూ తినే ఆవకాయ కూడా వాళ్ళు సృష్టించినట్లు పాశ్చాత్యులు చెప్పుకోవడం చూస్తున్నాము.

మన వాళ్ళు అది చదివి నిజమనుకునేలా ఉంటాయి వారి వ్రాతలు. ఇది మన జాతి తలరాత. పెద్దలు చెప్పినట్లు పునరపి జననం అనేది ఎంత సత్యమో , పూర్వ జన్మలో చేసిన పాప పుణ్యాల కర్మఫలితం కూడా మనతో ప్రయాణిస్తుంది అనేది కూడా నిజం .

### ఆ కారణాలేమిటి? వాటి ఫలితాలు ఏమిటి?

వాటి నివారణ ఎలా ఉంటుంది? ఇప్పుడు ఎలా జాగ్రత్త పడాలి అనేది తెలిపే అద్భుత శాస్త్రం మన జ్యోతిషం. కర్మ సిద్ధాంతం పాటించే మన దేశంలో ఆవిర్భవించిన అద్భుత శాస్త్రం జ్యోతిషం.జీవితంలో ఎదురవుతున్న ఆటంకాలను దాటడానికి దారిచూపే శాస్త్రం జ్యోతిషం.అభ్యుదయ వాదులుగా చలామణి అయ్యే వారికి మన శాస్త్రం పట్ల అవగాహన లేదు, దయ లేదు.హేతువాదం పేరిట అహేతుక వాదనలు చేసే వారిని,టివి చర్చలో కూర్చోబెట్టే యాంకర్లకు అస్సలే శాస్త్ర విషయాలు తెలియవు. చర్చా సమయం పూర్తి చెయ్యడం మాత్రమే వారికి కావాలి.వీరికి తోచింది రికార్డు చెయ్యడం,ప్రసారం చెయ్యడం మాత్రమే వారి చేతుల్లో ఉంటుంది.లోతైన అవగాహన లేని ప్రజలు కూడా విమర్శల బాటలో పయనిస్తూ ఉంటారు.విచక్షణ లేని వారు,వివేకం లేనివారు,శాస్త్రీయ అవగాహన లేనివారు వితండ వాదంతో విమర్శలు చేస్తుంటారు.




### జ్యోతిషం సత్యానికి నిలబడే శాస్త్రం.

కష్టాలను, కర్మను, ప్రారబ్దాన్ని దాటడం నేర్పేది జ్యోతిషం.చీకట్లో పయాణించేవారికి వెలుగు చూపే జ్ఞాన జ్యోతి, ఈ జ్యోతిషం.అందుకే ఇది "జ్యోతి" షం అయ్యింది

### జ్యోతిషం మన జీవన వేదం.

నాటిన విత్తనం వల్లే పంట వస్తుంది. ఇది ప్రకృతి శాస్త్రం.విత్తు విత్తాక ప్రకృతి సహకారం లభించాలి. అన్ని తగు మోతాదుల్లో ఉండాలి. గాలి, నీరు, నిప్పు లాంటి పంచ భూతాలు సహకరిస్తే పంట చేతికొస్తుంది. ఏది తేడా చేసినా మొత్తంగా బాధ మిగుల్తుంది.

అంతరిక్ష శాంతి శాంతిః,జీవ శాంతిః అని జీవన వేదం ఘోషిస్తుంది. అంతరిక్షం లో సూర్య చంద్రుల గ్రహాల వల్ల మానవ జీవితం పై ప్రభావం ఉంటుందని ఇప్పుడు నవీన శాస్త్రజ్ఞులు కూడా చెబుతున్నారు. సముద్రంలో వచ్చే ఆటుపోట్లకు చంద్రుడే కారణమంటున్నారు శాస్త్రజ్ఞులు ఇప్పుడు.ఇది శాస్త్రం అని చెబితే పుక్కిటి పురాణమని నిన్నటి దాకా హేలన చేసిన అహేతుక వాదులు మౌనం దాల్చుతున్నారు.అనంత ప్రకృతి నియమాలను ఆచారాల రూపంలో పెట్టిన మన పూర్వీకుల ప్రయత్నం అమోఘం.ఇవి గుడ్డి ఆచారాలని విమర్శించిన వారు వీటిలోని శాస్త్రీయత గురించి తెలుసుకోవడం శోధించడం చెయ్యలేదు. ఒక ఆచార వ్యవహారంలోని శాస్త్రీయత వెలికి తీయడం నిజమైన హేతువాదం.తెలియని నిజం ఇది అంటూ ఆచారాలలోని మంచిని వెతికి, వెలికి తీసి సమన్వయం చెయ్యడం హేతు వాదం.




**హేట్ వాదనలు, హీట్ వాదనలతో హేతువును కప్పిపెట్టడం శాస్త్రీయత కాదు.**

హేతువును వెతికి కనిపెట్టడం శాస్త్రీయత.ఆ ప్రయత్నం చెయ్యకుండా కొందరు విమర్శించడం మాత్రమే విజ్ఞానమనే భ్రమలో బతుకుతున్నారు.ఈ విమర్శను ఒక "ఆధునిక ఆచారం"గా మార్చుకున్నారు.సూర్య,చంద్రులు మన జీవం పైన ఒక్కో కాలంలో ఒక్కోలా ఫలితాన్ని చూపిస్తారు. ఇది శాస్త్రం.ఇదే సైన్స్. ఇది నిజం.ఎల్లవేళలా ఒక్కేలా ఉండే జీవ ప్రక్రియ గ్రహ ప్రభావం వల్ల, అంటే ప్లానెట్స్ వల్ల ఒక్కోసారి దెబ్బతింటుంది. మన జీవన పయనంలో, గ్రహ చలనాలు ఒక్కో వ్యక్తిపై ఒక్కోలా ప్రభావం చూపిస్తాయి. ఉదాహరణ కు ఇద్దరు పిల్లలు ఒకేసారి పుట్టినా వారి స్థానం, వాతావరణం అన్ని వేరు వేరు గా ఉంటాయి. మనకి రాత్రి సమయం ,వ్యతిరేక దిశలో గల దేశానికి పగటి సమయం.భూ పరిభ్రమణంలో ఈ తేడా ఉన్నప్పుడు, వారి జీవన శైలిలో తేడా ఉంటుంది అనే తార్కిక సత్యం తెలిస్తే ఇటువంటి ప్రశ్న ఉద్భవించదు.ఇదంతా శివశక్తి స్వరూపం. దీనినే ఎనర్జీ ఈజ్ ఈక్వల్ టు ఎంసి స్క్వేర్ అని భౌతిక శాస్త్రం చెబుతున్నది.ద్విగుణీకృత పదార్థం కాంతి వేగం వల్ల శక్తి రూపం మార్చుకుంటుంది అని కదా శాస్త్రం.ఈ సైన్స్ ను ఆచారాల్లో ఉపయోగిస్తున్న పామరులను కించపరచడం శాస్త్రీయత కాదు.ఆచార వ్యవహారాల శాస్త్రీయతను శోధించి సమన్వయం చెయ్యడం నిజమైన హేతువాదం.దీనినే ఆధ్యాత్మికం అంటారు.ఆది అంతాల ఆత్మను కనుగొనడమే ఆధ్యాత్మికత.ఆధ్యాత్మికత అంటే ఈ సృష్టిలోని ప్రతిదాన్నీ మీరు తెలుసుకోవాలని అనుకుంటున్నారని అర్థం. ఆధ్యాత్మికత అంటే మీ ఆసక్తి కేవలం భౌతిక జీవితం గురించే కాదు, జీవితంలోని అన్ని కోణాల గురించీ అని.తార్కికంగా ఆలోచిస్తే సత్యం వైపు నడిపించే ప్రకృతి నియమం కాల చక్రం, జ్యోతిషం.మన కంటికి కనిపించని శక్తి, మన కర్మలను నిర్ణయిస్తుంది, నియంత్రిస్తుంది.మానవుని దృష్టికి అందనిదే అదృష్టం.ఈ అదృష్ట, దురదృష్టాల పరీక్షలను తెలుసుకుని, నడుచుకునే మార్గం చూపించేది జ్యోతిషం.ఇవాళ అందరికీ తెలిసిన విషయం.విశ్వంలో అనేక నిగూఢమైన విషయ సంపద దాగి ఉంది అని. జ్ఞానులైన మన పెద్దలు దీనిని వేద విజ్ఞానం అని, జ్యోతిషం అని చెప్పారు.ఆ జ్ఞానాన్ని మనకు శాస్త్ర రూపంలో అందించారు.జ్యోతిష వ్యాఖ్యానాలు,వివరణలు,పదజాలం వేరు కావచ్చును కాని భావజాలం ఒకటే. తెలియక పోతే రహస్యం. తెలుసుకుంటే శాస్త్రం. ఇది స్థూలంగా జ్యోతిష శాస్త్ర వివరణ.రేపు జ్యోతిష శాస్త్రంలోని.. శాస్త్రీయతను తెలుసుకుందాం.ఓం ద్యౌహః శాంతిః అంతరిక్షం శాంతిః పృథ్వీ శాంతిః ఆపః శాంతిఃఔషధయ: శాంతిః వనస్పతయః శాంతిః విశ్వదేవా శాంతిః బ్రహ్మ శాంతిః సర్వః శాంతిః శాంతి రేవాశాంతిః శాంతిః సామా శాంతిః శాంతిః ఏధిః శాంతిః శాంతిః శాంతిః

స్వర్గానికి శాంతి, అంతరిక్షంపై శాంతి, భూమిపై శాంతి, జలాలపై శాంతి, మూలికలపై శాంతి,చెట్లపై శాంతి, విశ్వవ్యాప్త దేవతలకు శాంతి, పరమ సత్యానికి శాంతి, అందరికీ శాంతి, అందరికీ శాంతి.ఆ శాంతి మీకు కలుగుగాక.ఓం శాంతిః శాంతిః శాంతిః

# ఈనెల7నఆటో,టాక్సీ,వ్యాన్,క్యాబ్ ల బంద్ ను విజయవంతం చేయాలి...

– టియూసిఐ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్..

**కరపత్రం బోధన్ డిసెంబర్ 05..**

ఈ నెల 7న నిర్వహించే ఆటో,టాక్సీ, క్యాబ్ ల రాష్ట్రవ్యాప్త బంద్ ను విజయవంతం చేయాలని టియుసిఐ రాష్ట్ర నాయకులు మల్లేష్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఆటో,టాక్సీ,క్యాబ్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆటో,టాక్సీ,క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్లలో ఆటో, టాక్సి, వ్యాన్, క్యాబ్ ల డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 7న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్ కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టియుసిఐ) రాష్ట్ర నాయకులు మల్లేష్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో,క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి 12000 రూపాయలు ఇస్తామని, ఆటో,మోటర్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని అన్నారని గుర్తుచేశారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని,ప్రమాదభీమాను 10 లక్షలకు పెంచి సాధారణ మరణాలకు వర్తింపజేయాలని కోరారు.



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆటోలకు, క్యాబ్లకు పార్కింగ్ స్థలాలు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేనట్లయితే 9 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ నాయకులు ఇర్షద్ పాషా, ఆటో కార్మికులు జాజుద్దీన్ సయ్యద్, జీవన్, నజీర్, అబ్దుల్ వాయిద్, బాబా, సలీం, అక్బర్, టాక్సీ డ్రైవర్ పల్నాటి యాదగిరి, రాజ శ్రీనివాస్, చందు, తుకారాం, మోహిద్, మోసీన్, దావూద్, ఇబ్రహీం, ముజాహిద్, మహమ్మద్, ఇమ్రాన్, వాసు, శ్రీను, అశోక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆగ్రో ఇండస్ట్రీస్ సంస్థ లాభాల బాటలో పట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్



**కరపత్రం హైదరాబాద్, డిసెంబర్ 05**

హైదరాబాద్ చింతల్ లోని రీజినల్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగ్రో ఇండస్ట్రీ ద్వారా రైతులకు ఉపయోగకరమైన విధానాలను రూపొందించడంతోపాటు రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఆగ్రో ఇండస్ట్రీస్ ద్వారా అధికారులు సిద్ధంగా ఉండాలని, ఆగ్రో ఇండస్ట్రీస్ ను లాభాల బాటలో ఉండేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ సంబంధించిన అద్దె బకాయిలు ప్రతి నెల క్రమం తప్పకుండా చెల్లించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు కార్పొరేషన్ చైర్మన్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ ఎండి రాములు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



# ఉత్తమ పౌరుల నిర్మాణంలో విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం సేవలు

**కరపత్రం ఎడపల్లి,డిసెంబర్ 05 :**

బోధన్ మండలం పోచారం గ్రామంలోని విపశ్వన అంతర్జాతీయ ధ్యాన కేంద్రంలో విద్యార్థులకు శాస్త్రియ పద్దతిలో అనాపానా,విపశ్వన ధ్యానం సీనియర్ విపశ్వన ఆధ్వర్యంలో జీ.వి.సుబ్రమణ్యం ప్రతి విద్యార్థిచే ప్రత్యక్షంగా ధ్యానం చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సెల్ ఫోన్, టీవీ,ఇంటర్ నెట్ వాకడం పెరుగటం వలన విద్యార్థులతో ప్రవర్తన, ఏకాగ్రత,క్రమశిక్షణ క్రమంగా తగ్గుతూ అనేక చెడు అలవాట్లు,మద్యం,సిగరేట్,ఇతర వ్యాసనాలకు లోను కావడం సర్వసాధారణంగా మారిపోతున్న తరుణంలో ధ్యానసాధన ద్వారా తిరిగి ఉత్తమ దేశపౌరులను నిర్మించాలనే సంకల్పంతో విపశ్వన ధ్యాన కేంద్రం కమిటీ సేవలందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో లింబారెడ్డి, డా.విజయ భాస్కర్,శంకర్,వెంకట్,రవీంధర్,జాన్కంపేట్ జడ్పీహెచ్ ఎస్,పోచారం,దూపల్లి



జడ్పీహెచ్ ఎస్ మూడు ప్రభుత్వ పాఠశాలు,విద్యా వికాస్ ప్రైవేట్ విద్యార్థులకు సుమారు 500 మంది విద్యార్థులు,50 మంది ఉపాధ్యాయులు,ప్రిన్సిపాల్స్,ఎడపల్లి ఎంఈవో సాయిలు, జెమ్స్,సురేష్,వెంకటలక్ష్మ ,ప్రిన్సిపాల్,శ్రీనివాస్ ,విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తమ పాఠశాలలో విద్యార్థుల కోసం ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు,మేనేజ్ మెంట్ సంప్రదించాలన్నారు.

# యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిని సత్కరించిన టిపీసీసీ డెలిగేట్

**కరపత్రం వర్ని డిసెంబర్ 05,**

యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కృష్ణారెడ్డిని గురువారం పీసీసీ డెలిగేట్ కునీపూర్ రాజారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు.

## పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ ని వెంటనే విడుదల చేయాలి .......

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 5 ...**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట ఎన్ టి ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని దానికి నిదర్శనం ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కవస్తున్న ఇప్పటివరకు ఒక రూపాయి కూడా రియంబర్స్మెంట్ ని విడుదల చేయకపోవడమే నిదర్శనమని చెప్పుకొచ్చారు.. దివంగత నేత స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు నీరుపేద విద్యార్థిని విద్యార్థులకు విద్య అందాలని ప్రతి పేద విద్యార్థి ఉన్నతమైనటువంటి విద్యను అందుకోవాలని గొప్ప సంకల్పంతో ఆలోచన చేసి రియంబర్స్మెంట్ స్కీంని ఏర్పాటు చేశారు కానీ ఈరోజు అదే కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల అట్లా నిరంకుశ మైనటువంటి శైలిని చూపెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు చర్యగా భావిస్తున్నాం, ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్లో ఉన్న పూర్తి రియంబర్స్మెంట్ను వెంటనే విడుదల చేయాలని ఒకవేళ విడుదల చేయని యెడల రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణను చేపడతామని హెచ్చరించడం జరుగుతుంది..ఈ కార్యక్రమంలో శివ, రాజు, దినేష్, సాయి తదితరులు పాల్గొన్నారు

## మాయమవుతున్న ప్రభుత్వ భూములు

**– మాయమవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలి – రామకృష్ణారెడ్డి**
**– బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గారికి వినతి పత్రం అందజేసిన రామకృష్ణారెడ్డి**

**మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా. డిసెంబర్ 5 కరపత్రం రంగారెడ్డి జిల్లా ప్రతినిధి )**





బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19 వ డివిజన్ గాయత్రి హిల్స్ కాలనీకి సంబంధించిన సర్వే నంబర్ 776, 756 లో ఓపెన్ స్థలాన్ని కొంతమంది రాజకీయ నాయకులు దౌర్జన్యంగా, అక్రమంగా కబ్జా చేసి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇట్టి స్థలాలను బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోవాలని బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో బడంగ్పేట్ నగరపాలక సంస్థ ఉన్నప్పుడు కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే అప్పుడు ఉన్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ఈ స్థలం ప్రభుత్వ భూమి దీని జోలికి ఎవరు వచ్చినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కానీ ప్రస్తుత టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులు ముడుతున్నాయని చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు అని ప్రజలు అనుకుంటున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఎవ్వరికి అమ్ముడు పోయారని పలువురి అభిప్రాయం. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో హైడ్రా సంస్థకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి హిల్స్ కాలనీ నివాసి పవన్, మల్లెల మహేందర్, బీజేవైఎం నాయకులు సతీష్ నంద ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## మాజీ మంత్రి హరీష్ రావు,ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి లకు కావాలనే అక్రమ కేసులు

**– ఖండించిన బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రుద్రారపు శ్రావణ్ కుమార్,**

**కరపత్రం హుజురాబాద్ /ప్రతినిధి: డిసెంబర్ 5,**



హుజురాబాద్ ఒక యువ ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీష్ రావు ను అరెస్టు చేయడం అప్రజాస్వామికం, అధికారం ఎవరికి శాశ్వతం కాదు,ప్రజాస్వామ్యంలో ఒక ఎమ్మెల్యే ఫోన్ ట్యాపింగ్ చేయడం దురదుష్టకరం, రేవంత్ రెడ్డి పాలన పైన దృష్టి పెట్టాలి. కాని పాలన చేతగాక ప్రతిపక్ష నాయకుల పైన అక్రమ కేసులు పెట్టించి అరెస్టు చెయడం అప్రజాస్వామికం .మీఅరెస్టులకు బెదిరింపులకు బిఆర్ఎస్ పార్టీ భయపడదు అని హెచ్చరించారు మీరు ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ప్రజా క్షేత్రంలో నిలదీస్తూనే ఉంటాం ,అరెస్టు చేసినా మా నాయకులను వెంటనె విడుదల చేయాలి, రాష్ట్ర బీఆర్ఎస్ కార్యకర్తలు మొత్తం మా నాయకుల కోసం పోరాటం చేస్తారు. మీ హామీలు అమలు చేయించే క్రమంలో జైల్ కి అయిన పోవడానికి సిద్దంగా ఉన్నారు అని పత్రిక ప్రజల్లో తెలిపారు

## మంత్రి దామోదర రాజ నరసింహ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నీలం మధు

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: డా. ఏర్పుల శ్రీనివాస్.**



తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని ఆయన స్వగృహంలో మంత్రి దామోదరని కలిసి పుష్పగుచ్చమిచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న దామోదర్ రాజనర్సింహ తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా వైద్య శాఖలో తనదైన ముద్రను వేస్తున్నారని కొనియాడారు.

# ఈ నెల 7న ఆటోల బంద్ విజయవంతం చేయండి..!



**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 5:**

ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 7 న నిర్వహించనున్న బంద్ విజయవంతం చేయాలని ఆటో జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు మట్ట నర్సయ్య, ఆటో యూనియన్ మండల అధ్యక్షులు కందుల నర్సింగంలు కోరారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం ఆటో జేఏసీ బంద్ కు సంబందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్ల జీవనం, జీవనోపాధి అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 15 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని, రవాణా రంగా కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మహాలక్షి ఉచిత బస్సు పథకం వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ, 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను రూ, 10 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉదాసీన వైఖరిని నిరాశిస్తూ.. ఈ నెల 7 న ఆటోల బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే రోజు ఆటోలతో ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఆటో బంద్ విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు సంకరి కుమార్, కొసన మల్లయ్య, జంగపెల్లి తిరుపతి, సుంకిత సదయ్య, సుంచు శ్రీనివాస్, కాస రవి, ఓరగంటి మల్లేష్, దీకొండ రమేష్, బుర్ర సిద్దు, ఖాజాఫాషా, షారుక్, అబ్జల్, కూనమల్ల రాయనర్స్, కేశెట్టి రమేష్, అమీర్ ఖాన్, మానక ఓదెలు, భూంపెల్లి ఓదెలు, కామెర నర్సయ్య, పిడుగు లక్ష్మణ్, సెల్పూరి కొమురయ్య, ఎం. డి చాంద్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నీ అరెస్టును తీవ్రంగా ఖండించిన

**– జమ్మికుంట మున్సిపల్ చైర్మన్..**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 5**



కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కెళ్ళపల్లి రాజేశ్వరరావు గురువారం రోజున ఆయన నివాసంలో విలేకుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంజారాహిల్స్ సిఐని తనపై ఫోన్ టాపింగ్ జరుగుతుందని ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన పాడి కౌశిక్ రెడ్డిని సిఐ పట్టించుకోకుండా వెళ్లడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే వస్తుండడం చూసి సిఐ ఎలా వెళ్తారని ఫిర్యాదు తీసుకోమని అడిగినా కూడా నాకు పని ఉంది అని బయటికి వెళ్తున్నానని పట్టించుకోకుండా వెళ్తున్న క్రమంలో సీఐ వాహనానికి అడ్డుగా నిలబడి ఎమ్మెల్యే ఫిర్యాదు తీసుకోవాలని కార్యకర్తలు కోరారు అని, ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేకు కనీసం గౌరవం ఇవ్వకుండా వెళ్లిపోవడం ఏంటని మండిపడ్డారు. ఆ విషయాన్ని పట్టుకొని ఎమ్మెల్యే పై 20 మంది కార్యకర్తలపై కూడా కేసు నమోదు చేశారు అని,గురువారం రోజున ఎమ్మెల్యే నివాసం కి వెళ్లి తలుపులు కొట్టి ఒక ఉగ్రవాదుల ఎమ్మెల్యే అని చూడకుండా దౌర్జన్యంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, కౌశిక్ రెడ్డి ని పరామర్శించడానికి వెళ్లినటువంటి మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును కూడా అరెస్టు చేశారని, ఇది ప్రజాస్వామ్యమా లేక హింసాత్మక పాలన అని ఆయన ప్రశ్నించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని లేనియెడల పరిమాణాలు తీవ్రంగా ఉంటాయని ఆయన అన్నారు.... ఈ కార్యక్రమంలో జమ్మికుంట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్. మున్సిపల్ కౌన్సిలర్లు పతకాల రమేష్. గాజుల భాస్కర్. పొనగంటి విజయలక్ష్మి మల్లయ్య. మంద రాజేష్. పొనగంటి సందీప్. పొనగంటి శ్రీధర్ . బిఆర్ఎస్ కార్యకర్తలు వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

# కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరం విజయవంతం

**హుజురాబాద్ డి ఎం హెచ్ ఓ**
**కరపత్రం, హుజురాబాద్ డిసెంబర్ 5......**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్య శాఖ ఉత్తర్వుల మేరకు ఈరోజు కరీంనగర్ జిల్లా జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రం లో డాక్టర్ చందు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ, సూపరిండెంట్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వావిలాల ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వివిధ గ్రామాల నుండి ఏఎన్ఎం లు మరియు ఆశాల ద్వారా వచ్చిన అర్హులైన 25 మంది మగవారికి కోత,కుట్టులేని (ఎన్ ఎస్ వి )కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం జరిగింది ఆపరేషన్ల అనంతరం డాక్టర్ చందు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న వ్యక్తులకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి వారికి వివరంగా చెప్పడం జరిగింది ఈ శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి డాక్టర్ చందు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ చందు డిప్యూటీ డిఎంహెచ్ఓ హుజురాబాద్, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి సూపరిండెంట్ సామాజిక ఆరోగ్య కేంద్రం జమ్మికుంట, శ్యాం కుమార్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్,హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి సూపర్వైజర్ సదానందం ఏఎన్ఎంలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళ ఒక ఇంటర్ ప్రెన్యూర్ గా మారాలి





**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి. డిసెంబర్ 5**




ప్రజా పాలనా ప్రజా విజయోత్తవలలో భాగంగా జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ మేడ్చల్ మల్కాజ్గిరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం గ్రామస్థాయిలో స్వయం సహాయ సంఘాల ద్వారా ఇందిరా మహిళా శక్తి ద్వారా సాధించిన ప్రగతి గురించి స్వయం సహాయక సంఘాల సమావేశా లను ఏర్పాటు చేయడము ర్యాలీ లు నిర్వహించడము జరిగినది. అలాగే మన జిల్లా నుండి రాష్ట్ర స్థాయిలో ముఖ్య మంత్రిచే ఇందిరా మహిళా బజార్ ఓపెనింగ్ కార్యక్రమం శిల్పారామంలో ఉన్నందున మన జిల్లానుండి 4గురు ఎంటర్ ప్రేన్యూర్ఎస్ హెచ్ జి మెంబర్స్ ను స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే మహిళా శక్తి లో భాగంగా మండలానికి 1చొప్పున కాంటీన్ లు, బ్యాక్ యార్డ్ పోల్ట్రీ 100మందికి, మదర్ యూనిట్ లు 3, ఎంటర్ ప్రైజస్ 1250, సంఘాలలో లేనివారిని సంఘాలలో 1700, మందిని కృత సంఘాలలోకి బొట్టు పెట్టి ఆహ్వానించడం జరిగింది. అదేవిధంగా మూసి నిర్వాహక ప్రాంతాల్లో నుండి పునరావాసం కల్పించబడిన ప్రతాప్న ప్రతాప్సింగారం గ్రామపంచాయతీ నందు సమావేశం ఏర్పాటుచేసి సభ్యులను కొత్త సంఘాలలోకి చేర్పించి వారికి మహిళా శక్తి కార్యక్రమాలపై అవగాహన కల్పించి వారికి కూడా ప్రభుత్వ పథకాలు మరియు బ్యాంకు లింకేజీల ద్వారా ఆర్థిక సహాయం అందించుటకు సూచించనైనది.